క్లుప్తంగా

హార్టికల్చర్ అధికారిగా మౌనిక



రాయదుర్గం: రాయదుర్గం డివిజన్ హార్టికల్చర్ అధికారిగా మౌనిక సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధుల్లో ఉన్న దస్తగిరిని ఇటీవల బదిలీ చేయడంతో ఖాళీగా ఉన్న హెచ్ఓ పోస్టును రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ రాయదుర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చేలా కృషి చేస్తానన్నారు. రైతులంతా ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపి ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి రైతులకు అందే ప్రోత్సాహకాలను సకాలంలో అందేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ఉరగాద్రి చౌడేశ్వరీ ఆలయ ప్రాంగణంలో స్థానిక సమైరా ఆస్పత్రి ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన కిమ్స్ సవీరా ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత గుండె, సాధారణ వైద్యశిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆలయ చైర్మన్ కొత్త శ్రీనివాసులు, సమైరా ఆస్పత్రి నిర్వాహకుడు కొత్త శరత్ ప్రారంభించారు. వైద్యాధికారిణి డాక్టర్ సాక్షినస్రత్ జహ ఆధ్వర్యంలో 1,500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఓబన్న, వైద్యులు రామ్మోహన్‌బాబు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సాయిరాం

గుమ్మఘట్ట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ సాయిరాం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే 'నాడు-నేడు' పనుల్లో జాప్యం చేయొద్దన్నారు. సిమెంటు, ఐరన్, ఇసుకను ఇప్పటికే అన్ని పాఠశాలలకు సరఫరా చేశామన్నారు. ఆగస్టు నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగమణి, రామచంద్ర, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎస్ఎస్ఏ ఏపీఓ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండలోని సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా సోమవారం తెలిపారు. సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు హాజరై ధ్రువీకరణ పత్రాలను పొందాలని ఆయన సూచించారు.

బైలాంజనేయస్వామి ఆలయంలో చోరీ



హుండీ పగలగొట్టిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సిద్దేశ్వర కాలనీలోని బైలాంజనేయస్వామి ఆలయంలోని హుండీలోని నగదు చోరీకి గురైంది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగి ఉండవచ్చని పూజారి తెలిపారు. హుండీ తాళం పెకలించి అందులోని కానుకల డబ్బు దొంగలించారు. రూ.20 వేల దాకా నగదు ఉండవచ్చని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన సమయంలో హుండీ పగలగొట్టి చోరీ చేసినట్లు గుర్తించినట్లు అర్చకుడు మారుతి తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

యాటకల్లులో..

శెట్టూరు: మండలంలోని యాటకల్లు గ్రామంలోని రెండు ఆలయాల్లో దుండుగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి గ్రామంలోని ఆంజనేయస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఉన్న హుండీల్లోని కానుకల సొమ్ము ఎత్తుకెళ్లారు. రెండు దేవాలయాల్లో సుమారు రూ.35 వేల నగదు ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చౌడేశ్వరి మాతా పాహిమాం..



రాయదుర్గం: అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న కాపు భారతి. చిత్రంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు బహూకరించిన అనంతరం పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

- అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన విప్ కాపు దంపతులు
- ఉరగాద్రిలో పట్టువస్త్రాలు బహూకరించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో తొగటవీర క్షత్రియ కుల దేవత చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఆషాఢ మాసం చివరి అమావాస్యను పురస్కరించుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణ, పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమార్చన లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఉపవాస దీక్షతో అమ్మవారికి చేనేత పట్టు చీర సమర్పించి మహా మంగళ హారతి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. వేలాది మంది మహిళలు హాజరై అమ్మవారి దివ్య దర్శనభాగ్యం పొందారు.

'వడిబియ్యం సమర్పించిన విప్ కాపు దంపతులు'

రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి రాయదుర్గం పట్టణంలోని చౌడేశ్వరి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. విప్ మాట్లాడుతూ తొగటవీర క్షత్రియులంతా అమ్మను ఇష్టంగా కొలవడం, అందులో తమను భాగస్వాములను చేయడం సంతోషాన్నిస్తోందన్నారు. అనంతరం విప్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు గట్టు శ్రీరాములు, అధ్యక్షుడు సి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి హనుమంతు, సంఘం అధ్యక్షుడు మద్దిలేటి ప్రభాకర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉరవకొండ: చౌడేశ్వరీ జయంతి సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి భారీ ఊరేగింపు నడుమ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పట్టువస్త్రాలు సంప్రదాయబద్ధంగా బహూకరించారు. మాజీ ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్ కొత్త శ్రీనివాసులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో పాటు ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, నాయకులు ఓబన్న, బసవరాజు, ఓబుళేసు, లక్కా ఎర్రిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పురామనుకట్ట చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. చౌడేశ్వరీ కాలనీ, 4వ వార్డు పెద్ద చౌడేశ్వరి ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు.

ఘనంగా గ్రామోత్సవం

కుందుర్పి: మండల కేంద్రంలోని ఉల్లిగడ్డవారి తోటలో చౌడేశ్వరి దేవి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



కుందుర్పి: అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నీటి సమస్య పరిష్కారానికి కృషి



పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న వలంటీర్ సంజీవరాయుడు(ఫైల్)

వలంటీర్లకు వందనం

కూడేరు: కరోనా సమయంలో మండలంలోని జయపురంలో వలంటీర్ సంజీవరాయుడుకు కేటాయించిన 50 కుటుంబాలకు మంచి నీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ దెబ్బ తింది. కరోనా భయంతో మరమ్మతు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వలంటీర్ సంజీవరాయుడే మరో వ్యక్తి సాయంతో మరమ్మతులు పూర్తి చేశాడు. ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచి నీరు సరఫరా అయ్యేలా చూశాడు. దీంతో కాలనీ వాసులు అతడిని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ సేవలు అభినందనీయం



కాలనీకి నీరు సరఫరా చేసే పైపులైన్ దెబ్బతినడంతో సుమారు 10 రోజులు పాటు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డాం. కరోనా సమయం కావడంతో ఒకరి ఇంటికి మరొకరు వెళ్లే పరిస్థితి కూడా లేదు. ఇలాంటి తరుణంలో వలంటీర్ సంజీవరాయుడు ధైర్యం చేసి మరో వ్యక్తి సాయంతో పైపులైన్‌కు మరమ్మతు చేసి తాగునీటి సమస్య పరిష్కరించారు. వలంటీర్ సేవలు అభినందనీయం.

- చంద్రకళ

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతిచెందిన వన్నూరుస్వామి

బెళుగుప్ప: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మండలం జీడిపల్లికి చెందిన వన్నూరుస్వామి (42)కి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. తన తండ్రి ఎర్రిస్వామి పేరుపై ఉన్న మూడు ఎకరాల్లో వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం టమాట పంటకు నీరు పెడుతుండగా పెనుగాలులతో కూడిన చిరు జల్లులు పడ్డాయి. దీంతో మోటారును ఆపు చేసి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమై స్టార్టర్ పెట్టెను తాకగానే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల రైతుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విద్యుత్ శాఖ ఏఈ గంగాధర్, ఎస్ఐ రామకృష్ణయ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. పెనుగాలులకు విద్యుత్ తీగ తెగి స్టార్టర్ పెట్టెపై పడి కరెంట్ ప్రసారం జరిగినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలపై గవర్నర్ ప్రశంసలు



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విప్ కాపు దంపతులు

రాయదుర్గం: జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలపై రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్ సంతృప్తి వ్యక్తం చేసినట్టు ఆ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. ఎస్కేయూ 21వ స్నాతకోత్సవానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్‌ను ప్రభుత్వ విప్, రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి మర్యాదపూర్వకంగా కలసి జ్ఞాపికను అందజేశారు. అనంతరం గవర్నర్‌ను ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న రెడ్‌క్రాస్ సేవలపై కలెక్టర్ గౌతమితో కలసి వారు వివరించారు. కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. రక్తం లేక ఏ ఒక్కరు మరణించకూడదనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్త నిల్వలు పెంచేలా కృషి చేశామన్నారు. సొంత ఖర్చులతో మాస్కులు, శానిటేషన్లు, భోజన సౌకర్యం ఏర్పాటు చేశామని వివరించారు. వారి సేవలను మెచ్చి గవర్నర్ అభినందించారు.

ప్రజా సంక్షేమం కోసమే 'జగనన్న సురక్ష'



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ప్రజా సంక్షేమం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మారెంపల్లి, ఒంటిమిద్ది సచివాలయాల పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయం ఫణి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సేవలను దృష్టిలో ఉంచుకుని 11 రకాల సేవలను సచివాలయాల ద్వారా ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, కౌన్సిలర్ మహాలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు ఉమేష్‌రెడ్డి, షేక్షావలి, అర్చన, మంజు, జాకీర్, ఒంటిమిద్ది నాయకులు కిరీటి యాదవ్, ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, మున్సిపల్ మేనేజర్ అశ్వర్థ నారాయణ, సీనియర్ అకౌంటెంట్ అక్కులప్ప, శ్రీనివాసులు, ఉమేష్, వెంకటేశులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించి.. ఇంటి నిర్మాణం!



రోడ్డుపై అడ్డంగా ఇంటి నిర్మాణం చేపట్టిన దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట అయ్యప్ప నగర్‌లో టీడీపీ నాయకుడు వడ్డే లక్ష్మన్న రోడ్డును ఆక్రమించుకుని ఇల్లు నిర్మించాడు. వడ్డే బీమక్క పేరుతో గతంలో రెవెన్యూ అధికారులు 22x32 అడుగుల కొలతలతో ఇంటిపట్టా మంజూరు చేశారు. అయితే లక్ష్మన్న రోడ్డును సైతం ఆక్రమించుకుని 37 అడుగుల పొడువుతో ఇంటిని నిర్మించుకున్నాడు. రోడ్డుపై అడ్డంగా ఉన్న వస్తువులను తొలగిస్తే సిమెంటు రోడ్డు వేస్తారని గ్రామస్తులు ఎంతన చ్చచెప్పినా వినకపోగా వారిపైనే దౌర్జన్యానికి దిగి అడ్డంకులు సృష్టిస్తున్నాడు. రోడ్డును ఆక్రమించుకోవడంతో ఆ మార్గంలో మిగిలిన ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. రోడ్డను ఆక్రమించుకోవడంతో సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా మారిందన్నారు. రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారించి రోడ్డు మార్గాన్ని సుగుమమం చేయాలని వారు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కూడేరు: బాలవికాస్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కలగళ్లలో ఉచితంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. సుమారు రూ.4 లక్షల వ్యయంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సంస్థ సభ్యుడు బాలమోహన్ రెడ్డి మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కావడి స్వామి (పరంధామరెడ్డి) గ్రామంలో ఫ్లోరైడ్ అధికంగా ఉందని తన దృష్టికి తెచ్చారన్నారు. సంస్థ సభ్యులతో చర్చించి గ్రామస్తులకు శుద్ధ జలాన్ని అందించాలన్న లక్ష్యంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. బాలవికాస్ సంస్థకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



బొమ్మనహాళ్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



పెద్దకొట్టాలపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు చేయడం పవన్ కళ్యాణ్‌కు తగదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ కుట్రలు చేస్తున్నాయన్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ ఎన్ని కుట్రలు చేసినా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ విజయమ్మ, వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీటీసీ శివశంకరమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, జి.ఎం.నాయుడు, రమేష్, యువరాజ్ స్వామి, సంజప్ప, బుజ్జి, యోగేశ్వరరెడ్డి, జయరామ్‌రెడ్డి, పరమేశ్వర, కోటేశ్వరరెడ్డి, ఫోటో బసవరాజు, నాగరాజు, దేవన్న, ఆంజినేయులు, లక్ష్మీనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొట్టాలపల్లిలో విశ్వకు ఘన స్వాగతం

ఉరవకొండ(విడపనకల్లు): విడపనకల్లు మండలంలోని పెద్దకొట్టాలపల్లిలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ మోదుపల్లి రామాంజనేయులు, వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీత ఆధ్వర్యంలో భారీ గజమాలతో మాజీ ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించి, ఆ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధిపొందారో వివరించారు. రాబోవు 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిను మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పవతి, జెడ్పీటీసీ హనమంతు, పార్టీ మండల కన్వీనర్ బసన్న, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, నాయకులు కరణం భీమిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, కో ఆప్షన్ సభ్యుడు లతీఫ్, కొట్టాలపల్లి నాయకులు లక్ష్మీనారాయణ, మురళీమోహన్, బాబు, రామసుబ్బయ్య, కోటేశ్వర, మల్లికార్జున, కమలాకర్, చంద్రమౌళి, కొకుంట్ల వసంతమ్మ, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



వికసించిన బ్రహ్మకమలాలు

కూడేరు: స్థానిక మసీదు సమీపాన నివాసముంటున్న భాస్కర్ ఇంట్లో సోమవారం వేకువజామున సుమారు 30 బ్రహ్మకమలాలు వికసించాయి. వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరుగు పొరుగు వారు బ్రహ్మకమలాలను వీక్షించారు.

విద్యాసామగ్రి అందజేత

కంబదూరు: కర్తనపర్తి, డీసీపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు సోమవారం అనంతపురానికి చెందిన ఏజీ శ్రీనివాసరెడ్డి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ప్రమీల నోటు పుస్తకాలు, పలకలు, ఆట సామగ్రిని అందజేశారు. హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు నాగరాజు, బాలాజీ, కేశవరెడ్డి, సంగప్ప, శ్రీనివాసులు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత



సీఎస్‌డీటీని ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులు

కూడేరు: ప్రజాప్రతినిధులు చెప్పినా సమస్యలు పరిష్కరించరా అని వైస్ ఎంపీపీ దేవా, సర్పంచులు హనుమంతరెడ్డి, ఓబుళమ్మ, ఓబులేసు,, ధనుంజయ్య అధికారులను నిలదీశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో ఆలస్యంగా 11:50 గంటలకు ప్రారంభమైంది. రేషన్ డీలర్లు తక్కువ తూకాలతో బియ్యం పంపిణీ చేస్తున్నారు. మీరు పట్టించుకోరా? డీలర్ల సమావేశానికి సర్పంచులను ఆహ్వానించరా? అని సీఎస్‌డీటీ లక్ష్మీదేవిని సర్పంచులు ప్రశ్నించారు. పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు రూ.13 వేలు లంచం అడుగుతున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని వైస్ ఎంపీపీ ఖండిపడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు సర్పంచులు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అశ్వని, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు సర్దార్ వలి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ ఎంకే బాషా, పీఆర్‌ఏఈ శ్రీనివాసులు, ఏపీఎం రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దారి చూపండి

కళ్యాణదుర్గం: కంబదూరు మండల కేంద్రంలోని శివారు ప్రాంతం నుంచి పాఠశాలలకు వచ్చేందుకు రస్తా చూపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులతో కలిసి సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. 15 ఏళ్లుగా కంబదూరులో ఎస్సీ హాస్టల్, బీసీ హాస్టల్, కళాశాలకు విద్యార్థులు ఓ రైతు పొలం మీదుగా వెళ్తుండేవారు. తన పొలంలో వెళ్లకూడదంటూ ఆ రైతు రస్తాకు అడ్డు వేసుకున్నాడు. దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోయారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. వెంటనే విద్యార్థులకు రస్తా చూపాలని కోరారు. అనంతరం కార్యాలయ డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాలూకా ఇన్‌చార్జ్ చెలిమప్ప, కంబదూరు మండల అధ్యక్షుడు డాబా రమేష్, జీఎస్ఎస్ నాయకులు తిప్పేస్వామి నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిమోఫీలియా బాధితులకు సేవలు



హిమోఫీలియాతో బాధపడుతున్న చిన్నారులతో వైద్య బృందం



కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి చేరిన ఫ్యాక్టర్ ఇంజెక్షన్లతో వైద్యులు, సిబ్బంది

కళ్యాణదుర్గం: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం హిమోఫీలియా బాధితులకు వైద్యసేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ హేమలత మాట్లాడారు. గత కొన్నేళ్లుగా కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల నుంచి బాధితులు ఇంజెక్షన్ల కోసం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లేవారన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో సుమారు 50 మందికి పైగా బాధితులు ఉన్నారన్నారు. వారి కష్టాలకు స్పందించిన మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్యా వెంటనే ఫ్యాక్టర్ ఇంజెక్షన్ల కోసం సెంట్రల్ మెడికల్ స్టోర్స్‌కు సిఫారసు చేశారన్నారు. స్పందించిన సీఎంఎస్, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి 410 ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు పంపారన్నారు. ఇక హిమోఫీలియా బాధితులు కళ్యాణదుర్గం సీహెచ్‌సీలోనే వైద్య సేవలు పొందవచ్చన్నారు. అనంతరం సీహెచ్‌సీకి ఇంజెక్షన్లు రావడానికి కృషి చేసిన డాక్టర్ హేమలత, డాక్టర్ సాయి చరణ్, ఫార్మాసిస్ట్ తస్లీమా, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ వరప్రసాద్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హిమోఫీలియా సొసైటీ ఫౌండర్ కృష్ణమూర్తి, డాక్టర్లు ప్రసన్నభారతి, జమీలా, రూప, శ్వేత, దామోదర్, హెడ్ సిస్టర్ సుగుణ, స్టాఫ్ నర్సులు శ్రీదేవి, కాంతమ్మ, సొసైటీ సభ్యులు జక్కన్న, గణేష్ తదితరులు పాల్గొన్నారు.